స్కెచ్

# ముద్దమందారం : గడ్డిపువ్వు

శ్రీ అక్కిరాజు జనార్దనరావు

ప్రొద్దు ననంగా కాలేజీకని బయటపడ్డ శేషశాయి అన్ని ఎంగేజిమెంట్సూ ముగించుకొని ప్రొద్దుపోయాక యిస్సులు కొట్టుకుంటూ యింటికి చేరుకునేసరికి ముఖద్వారానికి గండుకప్పలాంటి తాళం కనిపించడంతో తావుల్ తప్పి మూర్ఛవచ్చినంతపనైంది. 'వాట్ టు డూ' మీమాంసలోపడి, 'పర'ధ్యానంలోవున్న శాయి. పక్కింటి చిట్టిబాబు "బాబాయిగారూ", అని పలకరించడంతో 'ఇహ' ధ్యానంలోనికి వచ్చాడు.

శాయికోసమే అక్కడ కాచుకొని వున్న చిట్టి మిత్రబృందంతో గోళీకాయల ఆటలోపడి ఆ సంగతే మరిచిపోయాడు. శాయిని చూశాక తన అసైన్మెంటు సంగతి గుర్తుకొచ్చి, "బాబాయిగారూ" అని పిలుస్తూ శాయి దగ్గరికి పరుగెత్తుకుంటూ వచ్చి జేబులోని తాళంచెవితీసి అందిస్తూ, "మీ వదినగారూ, మా అమ్మగారూ కలిసి మొదటాట సినిమాకెళ్ళారండీ. తాళంచెవి మీకిమ్మనిచెప్పారు. పెదబాబాయిగారు ఆఫీసు నుంచి వచ్చేవరకూ ఎటూ వెళ్ళకుండా ఇంట్లోనే వుండమన్నారు. వంటింట్లో వుట్టిమీద పాలున్నాయట. కావలిస్తే కాఫీ కాచుకోమని చెప్పారు", అని గబగబా వల్లించేసి తుర్రుమన్నాడు.

శాయికి వళ్ళుమండింది. ఆతాపానికి. పాపం జేబులోని సిటీబస్సు టిక్కెట్లూ, ప్రారంభోత్సవం జరుపుకోనున్న ఒకానొక డ్రైక్లీన్స్‌షాపు తాలూకు హాండుబిల్లూ బలిఅయ్యాయి. అన్నెంపున్నెం ఎరుగని అవి, చెక్కలు ముక్కలై సైడుకాలువ ప్రవాహంలో కలిసిపోయాయి.

"ఛీ... ఛీ... బుద్ధిలేని మనిషి... అలసి సొలసి మొగాళ్ళు కొంపకు చేరుకుంటారన్న జ్ఞానమన్నాలేదు. సినిమా ముందు అన్నీ బలాదూర్. కాఫీ కాచి ఫ్లాస్కులో పోసి పెడితే చేతులు కందిపోతాయేమో. కావలిస్తేకాచుకోవాలట. ఇంకానయం తనకూ ఒకకప్పు ఆట్టిపెట్టమని పురమాయించలేదు"— శాయి అంతరంగం విరుచుకుపడ్డది.

తాళంతీసి లోపలికెళ్ళడానికి బుద్ధిపుట్టక, పుస్తకాలను కిటికీలోనుంచి లోపలికి గిరాటేసి ఇంటిముందు అరుగుపై చతికిలపడ్డాడు.

"బాబూ"—

కోపనిద్రలోవున్న శాయి ఏకాగ్రతకు భంగం కలిగింది. కళ్ళుతెరిచి, తలెత్తి చూశాడు. ఎవరో—నెరిసిన మాసిన గడ్డంవాడు. మాసికల చొక్కావాడు, పట్టాగుడ్డసంచీవాడు— కనిపించాడు. "ఏమిటోయ్ నీ ఏడుపు... బస్సులో జేబుకత్తిరించారా... టిక్కెట్టుకు డబ్బుల్లేవా...పావలో పరకో కావాలా"—ఈ ప్రశ్నలన్నీ ధ్వనించేటట్లు ముఖంపెట్టాడు.

"ఈ పేటలో ముసునూరి మారుతీశ్వర్రావుగారి ఇల్లెక్కడ బాబూ... అప్పట్నించి వెదుకుతున్నా...

పొద్దుపోయింది... పెద్దవాణ్ణి...చూపు సరిగా ఆనదు. తెలిస్తే చూపించండి బాబూ... పుణ్యముంటుంది"— వృద్ధకంఠం వేడుకుంది.

శాయికి చుర్రుమన్నది. "చేతగాక నే చస్తుంటే నీ గొడవేమిటయ్యా" అందామని నోటిదాకా వచ్చింది. కాని "పాపం ముసలాడు" అన్న "ఫీలింగు" అడ్డంవచ్చి వదిలేశాడు.

"తిన్నగా వెళ్తే కుడిచేతివైపు తగిలే రెండో సందులో ఎడంవైపున వున్న ఆరో యిల్లే కీరదుగుతున్న హన్మంతరావు అదే మారుతీశ్వర్రావుది. చెత్తకుండీ, రెండు మూడు అవతారాలూ ఖచ్చితంగా ఆ యింటిముందే వుంటాయి." సవివరంగా గుర్తులు చెప్పేసి తిరిగి ఆలోచనలో పడ్డాడు— శాయి.

"ఏమండీ"— కాసేపటికి శాయి మౌనానికి మళ్ళీ భంగం కలిగింది. తలెత్తి పరికించాడు.

వయసుడిగిన ఒక నడివయస్కురాలూ, ముద్దమందారంలాంటి 'టీనేజరూ' దర్శనమిచ్చారు. వారిలో మొదటావిడను చూసి నడవడిగా ముందుకు మూడడుగులు వేసిన శాయి, చిరాకుపరాకుల ఆశ్వం ఆరెండో ఆమెను చూశాక, అంతకు నాలుగింతలు వేగంతో వెనక్కి పన్నెండడుగులు తగ్గింది.

"ఏమండీ ఈ వాడలో జంధ్యాల జోగినాధంగారిల్లెక్కడండీ... ఇక్కడెక్కడో మునిసిపల్ స్కూల్ పక్క సందులో అని చెప్పారు. ఎటువెళ్ళాలేంటి."

అమె అభ్యర్థన పూర్తి కాకుండానే "జోగి పంతులు గారిల్లా...ఇక్కడేలెండి... చూపిస్తాపదండి" అంటూ శాయి దిగ్గునలేచి నుంచున్నాడు.

"ఎందుకబ్బాయి నీకు శ్రమ— ఎటువెళ్ళాలో చెప్పు. మేం కనుక్కుంటాంలే."

"ఎవర్రా ఈమె. నాకు శ్రమ ఎందుకంటుంది. 'హెల్ప్ టు హెల్ప్‌లెస్ (యంగ్) లేడీస్'నా మోటో అని, పాపం ఈవిడకు తెలీదు", అని లోలోపలే అనుకున్న శాయి, పైకి "ఫరవాలేదు లెండి", అంటూ ఆమె పెదవి కదపడానికి కూడా ఛాన్సు యివ్వకుండా మార్గదర్శియై ధీమాగా నడక సాగించాడు. వారు వాడిని అనుసరించారు.

తాను యిచ్చిన డైరెక్షను తలక్రిందులుగా అర్థం చేసుకొని రివర్సు డైరెక్షనులో బయలుదేరి గమ్యం నుంచి దూరంగా వెళ్తున్న వృద్ధపాంథుడు మార్గమధ్యంలో శాయికి తారసిల్లాడు. కాని అతగాడిని వారించి తిరిగి వెళ్ళమనడానికి వాడికి టైమేదీ. పాపం అబలలకు లేటైపోదూ। ముద్దమందారం, గడ్డిపువ్వు ఒకే జాతివైనంత మాత్రాన ఒక్కటవుతాయా!!

